క్లుప్తంగా

కీసరగుట్టకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బోరబండ, కేపీహెచ్‌బీ, జగద్గిరిగుట్ట ప్రాంతాల నుంచి కీసరగుట్ట పుణ్య క్షేత్రానికి ప్రత్యేక బస్‌లు నడిపిస్తున్నట్లు కూకట్‌పల్లి ఆర్‌టీసీ డిపో మేనేజర్ ఇషాక్ మహ్మద్ తెలిపారు. శనివారం, ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కూకట్‌పల్లి నుంచి కీసరగుట్టకు, కీసరగుట్ట నుంచి కూకట్‌పల్లికి రాకపోకలు ఉంటాయని తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నల్ల చెరువు వద్ద వెలిసిన శ్రీపోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

18న ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లో వేంచేసియున్న వీరాంజనేయ శివాలయంలో ఈనెల 18వ తేదీన ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతసేవ, 4.30 గంటలకు గణపతిపూజ, 5.30 గంటలకు పుణ్యాహవచనం, 6గంటలకు అఖండ దీపారాధన, 6.30 గంటలకు సామూహిక ప్రత్యేక అభిషేకములు, సాయంత్రం 5 గంటలకు శ్రీ అమ్మవారికి విశేష పూజ, కుంకుమార్చన, రాత్రి 9.48 గంటలకు పార్వతీ సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవము, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం నవేదన, అర్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, భజన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఆలయ అర్చకులు పరాంకుశం వెంకటాచార్యులు, పి.గంగాధర్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

తల్లి చెంతకు తప్పిపోయిన చిన్నారి



చిన్నారిని తల్లికి అప్పగించిన పోలీసులు

భాగ్యనగర్‌కాలనీ: తప్పిపోయిన మూడు సంవత్సరాల చిన్నారిని కూకట్‌పల్లి పోలీసులు తల్లికి అప్పగించారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాగ్ అమీర్‌లోని పెట్రోలింగ్ చేస్తుండగా ఒంటరిగా తిరుగుతున్న చిన్నారిని గుర్తించిన హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌రావు చిన్నారిని చేరదీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాలనీతో పాటు ఆటో స్టాండ్‌లో విచారించగా తన తల్లి వివేకానందనగర్‌లో ఉన్నట్లుగా తెలుసుకొని చిన్నారి తల్లి దుర్గకు అప్పగించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

హెచ్‌సీయూలో సింపోజియం ప్రారంభం

రాయదుర్గం: స్థానిక సవాళ్లను స్వీకరించి ప్రపంచ నాయకత్వాన్ని సాధించాలని సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ ఎన్ కలైసెల్వి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా హైదరాబాద్ చాప్టర్, అకాడమీ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్, హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో డాక్టర్ జాకీర్ హుస్సేన్ లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో 'ఎలక్ట్రానిక్స్ ఫర్ సెల్ఫ్ రిలయన్స్' అనే అంశంపై రెండురోజుల సింపోజియం ప్రారంభించారు. భారతదేశంలోని వివిధ సీఎస్ఐఆర్ ల్యాబ్‌ల ప్రధాన విజయాలను ఆమె వివరించారు. ఐఐటీ న్యూఢిల్లీ మాజీ డైరెక్టర్ పిళ్లై చైర్ ప్రొఫెసర్ వి రాంగోపాల్‌రావు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో వినూత్న సాంకేతికతల పర్యావరణ వ్యవస్థను స్థాపించడం, విద్యారంగంలో స్టార్టప్‌లను ఏర్పాటు చేయడం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

గచ్చిబౌలి: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆస్పత్రి ఆవరణలో శిబిరం ప్రారంభమవుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు చెందిన ఔత్సాహిక రక్తదాతలు రక్తదానం చేయాలని కోరారు. శేరిలింగంపల్లిలో మూడు రోజులపాటు కేసీఆర్ జన్మదిన వేడుకలను ప్రత్యేక సంబరాలుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

చుట్టు పక్కల బస్తీలన్నీ అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నా.. ఆ బస్తీ మాత్రం అభివృద్ధికి ఆమడదూరం ఉంది. ఎవరిని కదిలించినా ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూ తమ అనుభవాలసారాన్ని వడబోస్తూనే ఉంటారు. ప్రజాప్రతినిధులు, వారి వెంట అధికారగణం వచ్చి పోతూంటారే కానీ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన మాత్రం చేయకపోవటం విచారకరం. ఆ కాలనీలో రెక్కాడితే గాని డొక్కాడని పేదలే ఎక్కువగా నివాసముంటారు. అదే హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ.



శ్రీరాంనగర్ కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు, పారుతున్న మురుగు



భాగ్యనగర్‌కాలనీ: నిత్యం సమస్యల వలయంలోనే జీవనం కొనసాగించాల్సిన దుస్థితి శ్రీరాంనగర్ కాలనీవాసులకు ఏర్పడింది. అందులో ముఖ్యంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపై మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. మురుగు రోడ్లపై పారుతూ దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఎగుడు దిగుడు రోడ్లతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్ని సమస్యల నడుమ కాలనీవాసులు జీవనం సాగిస్తున్నారు.

- ఎన్నికల సమయంలో కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చి పోవటమే తప్ప చేసిందేమీ లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలంటూ అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా... పరిష్కరించిన దాఖలాలు లేవని పేర్కొంటున్నారు.
- కాలనీలోని పలు వీధులు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు స్వైర్య విహారం చేస్తున్నారు. సమీపంలోని అంబీర్ చెరువు ఉండటంతో దోమలు కాలనీవాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని చెబుతున్నారు. సంపన్నులు నివసించే కాలనీలో రోజు విడిచి రోజు ఫాగింగ్ చేస్తున్న అధికారులు పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు నివాసముంటున్న కాలనీల్లో ఫాగింగ్ చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కాలనీ రోడ్లను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం కూడా చేయడం లేదని పేర్కొంటున్నారు. ప్రధానంగా ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై ఉన్న చెత్తను సైతం తొలగించడం లేదని చెబుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించాలని కోరుతున్నారు. అప్పుడైనా తమ కాలనీ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరించాలి..



శ్రీరాంనగర్‌కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్లతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొత్తగా రోడ్లను నిర్మించాలి. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కాలనీలో ఫాగింగ్ కూడా చేయడం లేదు. కాలనీపై అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి.

– సుమన్, శ్రీరాంనగర్‌కాలనీ నివాసి

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా టీఎన్‌జీవో కేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమం నాంపల్లిలోని టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. అలివేలు మంగమ్మ మాట్లాడుతూ... తలసీమియా వ్యాధితో బాధపడే పిల్లలకు రక్తదానం చేయడం నిజంగా అభినందనీయమన్నారు. అదే విధంగా ఒక వ్యక్తి రక్తం దానం చేస్తే కనీసం ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు రవికుమార్, డా. వాణి, వైస్ ప్రిన్సిపాల్, డా. భవాని, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలు



కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి సహకారంతో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్, మహిళా సాధికార సంస్థల ఆధ్వర్యంలో గురువారం కూకట్‌పల్లిలోని డిగ్రీ కళాశాలలో చెస్ పోటీలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా. అలివేలు మంగమ్మ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గెలుపొందిన వారు శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగే పోటీలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. భవాని, అధ్యాపకులు డా.వినోద్‌కుమార్, చెస్ ఆర్బిట్రేటర్ రత్న, జిల్లా యువజన, క్రీడా అదికారి బి. బలరామారావు తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట బస్టాండ్ హామీ ఏమైంది?



జగద్గిరిగుట్ట: ×ప్రజా గోస బీజేపీ భరోసా×కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని 336, 337, 338 బూత్‌లలో గురువారం శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్థానికులతో మాట్లాడారు. జగద్గిరిగుట్టలోని పేదలకు ఒక్క డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం రాగానే పేదలకు పక్కా ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి జగద్గిరిగుట్ట ప్రజలని బీఆర్ఎస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. ఈసారి మోసపోకుండా బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. జగద్గిరిగుట్ట బస్టాండ్ హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ వసుంధర, బూత్ అధ్యక్షులు గాయత్రి, మధు, డివిజన్ అధ్యక్షుడు పున్నా రెడ్డి, సీనియర్ నాయకులు పడాల సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అర్చకులు రుద్రపాక శివరామకృష్ణ శివైక్యం



శివరామకృష్ణ (ఫైల్)

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీలోని రోడ్ నం.2లోని శ్రీవీరాంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయ ప్రధాన అర్చకులు రుద్రపాక శివరామకృష్ణ గురువారం శివైక్యం చెందారు. ఆయన రెండు దశాబ్దాలకు పైగా ఈ ఆలయంలో సేవలు అందించారు. అనేక మంది భక్తులకు సహాయ సహకారాలు అందించారు. తద్వారా ఆలయ అభివృద్ధికి కూడా ఎంతో సహకారం అందించారు. శివరామకృష్ణ శివైక్యం చెందిన విషయాన్ని తెలుసుకున్న భక్తులు, మహిళా భక్తులు అనేక మంది ఆయన నివాసానికి చేరుకొని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సహాయ సహకారాలను నెమరువేసుకున్నారు. శుక్రవారం అమీన్‌పూర్‌లోని టీపీఆర్ రెసిడెన్సీ నుంచి అంతిమ కార్యక్రమం ఉంటుందని దేవాలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: చెట్ల కొమ్మలను తొలగింపు నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు భాగ్యనగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. జన్మభూమి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జన్మభూమి కాలనీ, దత్తాత్రేయకాలనీ, సుభాష్ నగర్, మహంకాళినగర్, మొగులమ్మ బస్తీ, ఖాజానగర్‌లలో... అదేవిధంగా భాగ్యనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు భాగ్యనగర్‌కాలనీలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

- కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ లాస్ట్ బస్‌స్టాప్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాస్ట్ బస్‌స్టాప్, ధరణీనగర్, చక్రధర్ నగర్ కాలనీ, షిర్డి హిల్స్, ఆదిత్యానగర్, సాయినగర్, ఆల్విన్‌కాలనీ బ్రిడ్జి, జలకన్య ప్రాంతాలు, వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆర్‌పీ కాలనీ, వెంకటేశ్వరనగర్, దీనబంధు కాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శరత్‌బాబు తెలిపారు.

18న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మోతీనగర్: పాండురంగానగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీకే కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 తేదీన స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 4.30 గంటలకు మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, 6.30 గంటలకు రుద్రాభిషేకములు, విశేష అర్చనలు, పూజలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు విశేష అర్చనలు, ఉంటాయని తెలిపారు. రాత్రి 9 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 11.30 గంటలకు లింగోద్భవ కాలములో ఏకవార రుద్రాభిషేకం చేస్తారని తెలిపారు.

ఘనంగా విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం

మూసాపేట: ప్రగతినగర్‌కాలనీ శ్రీసాయి విద్యానికేతన్ స్కూలులో వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. విద్యార్థులు దేశ, భక్తి, జానపద పాటలకు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అందని డబుల్ ఇళ్లు

- రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి జితేందర్
- హాఫీజ్‌పేట్‌లో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి జితేందర్

హాఫీజ్‌పేట్ : ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు ఇవ్వలేదని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి కె.జితేందర్ పేర్కొన్నారు. గురువారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హాఫీజ్‌పేట్, కుమ్మర బస్తీలలోని 241, 242 ,243 పోలింగ్ బూత్‌లలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కారక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాష్ట్ర నాయకులు మొవ్వ సత్యనారాయణలతో పాటు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 9 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. డబుల్ ఇల్లు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని ఇప్పటి వరకు ఒక్క ఇంటిని కూడా ఎవరికి కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కాయిదమ్మకుంట చెరువును అభివృద్ధిని మరిచిపోయారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడి బడుగు బలహీనవర్గాలకు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తుంటే, సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వాటిని అడ్డుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని ఫాం హౌస్‌కు పరిమితం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రావు, మనోహర్, హాఫీజ్‌పేట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్, శ్రీనివాస్, కుమార్, సాయి, వరప్రసాద్, శ్రీశైలం, పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మా దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజా గోస బీజేపీ భరోసాలో మాధవరం కాంతారావు



బాలాజీనగర్‌లో నిర్వహించిన ప్రజా గోస బీజేపీ భరోసాలో పాల్గొన్న మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: నిరంకుశ, అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు పోలింగ్ బూత్ అధ్యక్షులతో నిర్వహిస్తున్న ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ రఘురాం ఆధ్వర్యంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాధవరం కాంతారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

- అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపు మేరకు స్ట్రీట్ కార్నర్ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం... కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యిందని విమర్శించారు. కేంద్రం నుంచి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించినా.. రాష్ట్రానికి మొండి చేయి చూపించారని బీఆర్ఎస్ నేతలు అనడం హాస్యాస్పందంగా ఉందన్నారు.

యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు కష్టం

రాయదుర్గం: విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్‌ను అమలు చేయడం చాలా కష్టమైన పని అని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా మాజీ వైస్‌చాన్స్‌లర్, అలీఘర్ ముస్లిమ్ యూనివర్సిటీ న్యాయ విభాగం ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తఫా అన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యా విభాగం(డీడబ్ల్యూఈ) ఆధ్వర్యంలో సుఘ్రా హుమాయున్ మీర్జా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని గురువారం 'భారత రాజ్యాంగం, లింగ సమానత్వం, యూనిఫామ్ సివిల్ కోడ్' అనే అంశంపై వీసీ ప్రొ.ఐనుల్ హసన్ అధ్యక్షతన నిర్వహించారు. గతంలో మహిళలు విద్య అభ్యసించడం చాలా కష్టమైన పని అని, హుమాయున్ మీర్జా బాలికలు, మహిళలను విద్యలో ప్రోత్సహించారన్నారు. ఉర్దూ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ బాలికలు, మహిళల విద్యా కార్యక్రమాలకు ఉర్దూ విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఈ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ హెడ్ డాక్టర్ అమీనాతహసీన్, సఫ్దరియా బాలికల ఉన్నత పాఠశాల కార్యదర్శి, కోఆర్డినేటర్ హుమాయున్ అలీ మీర్జా ప్రసంగించారు. అనంతరం సుఘ్రా హుమాయున్ మీర్జా జీవితంపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు.

డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్‌లో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణ పనులను వలన బస్తీవాసులు ఇబ్బంది పడకుండా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఫ్రెండ్స్ కాలనీలో వాటర పైపులైను పనులు ఎంత వరకు చేపట్టారో పరిశీలించారు. వాటర్ వర్క్స్ వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వీరారెడ్డి, తులసీనగర్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, జ్ఞానేశ్వర్, సబీర్, నూర్, మతిన్, మొహమూద్, బ్రహ్మం, మల్లేష్, యోగిరాజు, సత్తమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణతో ముంపు సమస్యకు చెక్

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



ఈర్ల చెరువు వద్ద నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హాఫీజ్‌పేట్ : హాఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ల పరిధిలో ఎస్ఆర్‌డీపీ కింద చేపడుతున్న నాలా విస్తరణతో ముంపు సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు నుంచి దీప్తిశ్రీనగర్ జాతీయ రహదారి వరకు చేపట్టిన నాలా విస్తరణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.15.88 కోట్లతో 2.4 కిలోమీటర్ల మేర నాలా విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు . పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేసి పనులలో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌతమ్ గౌడ్, నాయకులు ఉమామహేశ్వరావు, నాగేశ్వరరావు, మోహన్, సురేందర్, ప్రదీప్, ఫణీంద్ర, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారం చేపట్టడం ఖాయం

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మాణిక్యనగర్, ద్వారకనగర్, మధుసూదన్‌రెడ్డినగర్, డీనగర్, కెఎంజి కాలనీ, ప్రతాప్ ఎస్టేట్స్, అంబేడ్కర్‌నగర్, చెరుకుపల్లి కాలనీల్లో పాదయాత్ర చేసిన హన్మంతరెడ్డి స్థానికంగా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గడప గడపకు హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమై పాలనను గాలికొదిలేశారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు ఆనంద్‌రావు, ఏ–బ్లాక్ సెక్రటరీ బాలయ్య, మాజీ వార్డు సభ్యుడు ఎండీ జాకీర్, జెస్సీపాల్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే విఫలం

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో కనీసం మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే గాంధీ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. గురువారం శ్రీరామనగర్ కాలనీ శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ హయాంలో శ్రీరామ్‌నగర్ కాలనీ ఇళ్ల స్థలాలకు జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పట్టాలను ఇప్పించడం, 120 అడుగుల రోడ్డు విస్తరణ చేయించగా ఇప్పటి వరకు గాంధీ పూర్తి చేయలేదని విమర్శించారు. ఒక రూపాయికి నల్లా కనెక్షన్ అని చెప్పి వేల రూపాయల బిల్లులు వసూలు చేశారని, స్థలాల సుందరీకరణ పేరుతో చెరువుల కబ్జాకు పాల్పడటం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ప్రతి కార్యకర్త కేసీఆర్ అవినీతిని ఇంటింటికీ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, రాజుశెట్టి, కాంచనకృష్ణ, అనంతరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.